సెమినార్‌ను ప్రారంభిస్తున్న వైద్య నిపుణులు

బస్సును అడ్డుకుని డ్రైవర్‌తో ఘర్షణకు దిగిన స్థానికులు

ఆగని ఆర్టీసీ బస్సు

అరగంటపాటు చంటిబిడ్డతో రోడ్డుపైనే మహిళ
స్థానికుల ఆగ్రహం.. బస్సు అడ్డగింత..!

ప్రజాశక్తి-బత్తలపల్లి

ఉచిత బస్సు మహిళల ప్రయాణానికి కొత్త కష్టాలను తెచ్చిపెడుతోంది. గతంలో చేయి ఎత్తిన చోట బస్సు ఆపి ప్రయాణికులను ఎక్కించుకునే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి కన్పించడం లేదు. ఇలాంటి ఘటనే బత్తలపల్లి మండల కేంద్రం తహాశీల్దార్ కార్యాలయం వద్ద శనివారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... బత్తలపల్లి తహాశీల్దార్ కార్యాలయం ముందు శనివారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో ఓ మహిళ చంటి బిడ్డతో ధర్మవరం వెళ్లేందుకు రోడ్డు పక్కన వేచి ఉంది. ఈ సమయంలో అటుగా వచ్చిన ఆర్టీసీ బస్సులను ఆపమని మహిళ చేయి ఎత్తింది. ఇలా దాదాపు ఐదారు బస్సులు ఆపకుండా వెళ్లిపోయాయి. మధ్యాహ్నం 12 గంటలు అవుతున్నా ఒక్క బస్సు కూడా ఆపకుండా వెళ్లిపోయింది. ఇది చూస్తున్న స్థానికులకు ఈ ఘటన తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించింది. ఇదే సమయంలో ధర్మవరం డిపోకు చెందిన ధర్మవరం- పులివెందుల బస్సు అటు రాగా మహిళా మళ్లీ బస్సు ఆపేందుకు చేయి ఎత్తింది. అది కూడా ఆపకుండా వెళ్లడంతో స్థానికులు ఒక్కసారిగా ఆగ్రహానికి లోనయ్యారు. వెంటనే అక్కడున్న వారు ద్విచక్రవాహనంలో బస్సును వెంబడించి జాతీయ రహదారి బ్రిడ్జి వద్ద అడ్డుకున్నారు. బస్సు ఎందుకు ఆపడం లేదంటూ డ్రైవర్‌తో ఘర్షణ పడ్డారు. మహిళా చంటిబిడ్డతో రోడ్డుపై ఉన్నా బస్సు ఆపకుండా వెళ్తారా అంటూ నిలదీశారు. ఉచిత బస్సు పేరుతో ఇలా మహిళను ఇబ్బంది పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. అనంతరం అందరూ చంటిబిడ్డతో ఉన్న మహిళను బస్సులో ఎక్కించి పంపారు. బస్సును ఆపకుండా వెళ్తున్న వారిపై చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని అక్కడి స్థానికులు కోరారు.

బార్లకు ముగిసిన లాటరీ

ప్రజాశక్తి-అనంతపురం

బార్ లైసెన్సుల మంజూరుకు లాటరీ పద్ధతిలో శనివారం నాడు కేటాయింపులు చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనూ ఈ ప్రక్రియ పూర్తయింది. కల్లుగీత కార్మికుల రిజర్వుతో కలిపి మొత్తం 23 బార్లకు రెండు జిల్లాలోనూ కలిపి దరఖాస్తులు ఆహ్వానించారు. ఇందులో సత్యసాయి జిల్లాలో నాలుగు బార్లకు తగినన్ని దరఖాస్తు రాకపోవడంతో పెండింగ్‌లో ఉన్నాయి. తక్కిన అన్ని బార్లకు లాటరీ పద్ధతిలో కేటాయింపులు జరిగాయి.

శ్రీ సత్యసాయి జిల్లాలో లాటరీ నిర్వహిస్తున్న కలెక్టర్ టిఎస్.చేతన్

అనంతపురం జిల్లాలో అన్నీ పూర్తి

అనంతపురం జిల్లాలో పది బార్లు నాన్ రిజర్వులో ఉండగా రెండు బార్లు కల్లుగీత కార్మికుల రిజర్వేషన్ కింద కేటాయించారు. 12 బార్లకు మొత్తం 50 మంది దరఖాస్తు చేసుకున్నారు. అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ మద్దయ్య ఆధ్వర్యంలో లాటరీ ప్రక్రియను నిర్వహించారు. వచ్చిన దరఖాస్తుల నుంచి లాటరీ పద్ధతిలో డ్రా తీసి బార్లకు లైసెన్సులు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారి రామ్మోహన్‌రెడ్డి, ఎఇఎస్ రేవతిలు డ్రా తీశారు. పేర్లు వచ్చిన వారికి అసిస్టెంట్ కలెక్టర్ మంజూరు పత్రాలను అందజేశారు.

సత్యసాయి జిల్లాలో ఏడు బార్లకు లైసెన్స్ మంజూరు

సత్యసాయి జిల్లాలో పది బార్లు అన్ రిజర్వులో ఉండగా ఒకటి కల్లుగీత కార్మిల రిజర్వులో ఉంది. మొత్తం 11 బార్లకు లైసెన్స్ కోసం దరఖాస్తులు ఆహ్వానించారు. ఇందులో ఏడు బార్లకు లాటరీ పద్ధతిలో లైసెన్సు మంజూరుకు జిల్లా కలెక్టర్ చేతన్ ఆధ్వర్యంలో కేటాయింపులు చేశారు. తక్కువ దరఖాస్తులు వచ్చిన నాలుగింటికి కేటాయింపులు జరగలేదు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా ఎక్సైజ్ అధికారి గోవిందనాయక్, ఎఇఎస్ బి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఔషధ నిరోధకతపై అవగాహన అవసరం

మైక్రోబయాలజిస్టుల పాత్ర కీలకం
సదస్సులో వైద్యరంగ నిపుణులు

ప్రజాశక్తి-అనంతపురం

ఔషద నిరోధకతపై అవగాహన అవసరం అని, ఇందులో మైక్రోబయాలిజిస్టుల పాత్ర అత్యంత కీలకం అని పలువురు వైద్యరంగ నిపుణులు పేర్కొన్నారు. అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల సుశ్రుత సెమినార్ హాల్లో డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రాయలసీమ జోన్ మైక్రో బయాలజీ జోనల్ నిరంతర వైద్య విద్యా సదస్సును శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కర్నూలు, కడప, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, అనంతపురం జిల్లాల నుంచి సుమారు 98 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులు హాజరయ్యారు. ఔషధ నిరోధకత తగ్గించడంలో మైక్రో బయాలజీలోని ఔషధ నిర్ధారణ పరీక్షల్లో సాంప్రదాయ, యంత్రాల పద్ధతులపై ఇందులో చర్చజరిగింది. ఈ సందర్భంగా వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ షారోన్ సోనియా, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ తెలుగు మధుసూదన్, మైక్రో బయాలజీ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ శాంతి రెడ్డి, రాయలసీమ మైక్రో బయాలజీ సిఎంఈ జోనల్ కోఆర్డినేటర్ డాక్టర్ విజయలక్ష్మి, సిఎంఈ అబ్జర్వర్ డాక్టర్ సరళ, డాక్టర్ పద్మ శ్రావణి తదితరులు మాట్లాడారు. మైక్రోబయాలజిస్టులు ఎవిడెన్స్ బేస్ట్ మెడిసిన్ (సాక్ష్యం ఆధారంగా నిర్దేశిత మందు)ను తెలియజేస్తారన్నారు. డాక్టర్ సలహా మేరకు కాకుండా సొంతంగా మందులను వినియోగించడం సరికాదన్నారు. డాక్టర్ సూచించకుండా మందులను అమ్మడం, వాడమన్నంత మోతాదులో మందులను వాడకపోవడం ఔషధ నిరోధకతకు (డ్రగ్ రెసిస్టెన్స్)కు కారణమన్నారు. డాక్టర్ సలహా తీసుకున్న తర్వాతనే వ్యాధిగ్రస్తుడు మందులను తగిన మోతాదులో వాడాలని సూచించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షకులు, వైద్యులు పద్మ శ్రావణి, హైమావతి, వేముల సరోజ, మీనిగ శైలజ, డాక్టర్ ఉమాదేవి, బసిరెడ్డి ప్రవీణారెడ్డి, ప్రియాంక పుదూర్, లలిత భవాని, దివ్య, కృష్ణవేణి, ఎల్లం నాయుడు పలు విషయాలను తెలియజేశారు. అనంత వైద్య కళాశాల పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులు భారతదేశంలో మందులు వాడకంపై ప్రదర్శించిన లఘు నాటిక అందరినీ ఆలోచింపజేసింది. ఈ కార్యక్రమంలో సీనియర్ మైక్రోబయాలజిస్ట్ డాక్టర్ గుండెల స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలోని రామాపురం ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 10వ రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. ఆయన శనివారం బత్తలపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ యువతీ, యువకులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సెప్టెంబర్ 12, 13, 14 తేదీల్లో మండలంలోని రామాపురం ఉన్నత పాఠశాల క్రీడా మైదా నంలో గ్రామ పెద్దల సహకారంతో రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ బాల, బాలికల జట్లు పాల్గొంటాయన్నారు.

నిమజ్జనంలో అన్నదానం చేస్తున్న ముస్లిములు

చవితి వేడుకల్లో మతసామరస్యం

సోమందేపల్లిలో గణేష్ నిమజ్జనంలో ముస్లిముల అన్నదానం

ప్రజాశక్తి-సోమందేపల్లి

సోమందేపల్లిలో శనివారం వినాయక నిమజ్జనం వేడుకలను ఘనంగా నిర్వహించారు. నిమజ్జనంలో పాల్గొన్న భక్తజనానికి స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో ముస్లిం మైనారిటీ నవ జవాన్ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేసి మతసామరస్యాన్ని చాటారు. ముస్లిం సోదరులు మాట్లాడుతూ భారత దేశంలో హిందూ, ముస్లింలు వేర్వేరు కాదు ఒక్కటే అన్నారు. అయితే కొందరు పని కట్టుకుని వేరు చేసే ఉద్దేశంతో లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారన్నారు. అలాంటి వారిని ప్రజలు ఎవరూ నమ్మవద్దని సూచించారు. భారత రాజ్యాంగం, దేశ కట్టుబాట్లకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామన్నారు. దేశం కోసం ప్రాణాలైనా అర్పిస్తామన్నారు. వినాయక చవితి వేడుకలు మాకు కూడా పండుగ లాంటిదే అని ముస్లిం మైనారిటీ నవ జవాన్ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ముస్లిముల పాల్గొని అందరికీ భోజనం వడ్డించారు. ఇక నిమజ్జనం ఊరేగింపులో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విద్యుత్ శాఖ అధికారులు కాసేపు సరఫరా నిలిపివేశారు. ఎస్ఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. 20కి పైగా రద్దీ ప్రాంతాలోల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అసాంఘిక కార్యక్రమాలు, గొడవలు జరగకుండా కట్టదిట్టమైన పోలీస్ బందోబస్తు నిర్వహించారు. గణేష్ నిమజ్జన ప్రాంతమైన పెద్ద చెరువులో తాత్కాలికంగా విద్యుత్ సౌకర్యం కల్పించారు.

టెక్‌స్పోర్ట్స్ గార్మెంట్స్ దుశ్చర్య

మహిళా కార్మికురాలిపై ఏపీఎం దాడి- గార్మెంట్స్ ముందు కుటుంబ సభ్యుల ఆందోళన

ప్రజాశక్తి-పరిగి

పరిగి మండలంలోని కాలువపల్లి టెక్ స్పోర్ట్స్ గార్మెంట్స్‌లో ఎపిఎం మహిళా కార్మికురాలిపై దాడికి పాల్పడ్డారు. దీనిని నిరసిస్తూ బాధితురాలి కుటుంబ సభ్యులు గార్మెంట్స్ పరిశ్రమ వద్ద శనివారం ఉదయం ఆందోళన చేపట్టారు. బాధితురాలు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... కర్నాటక ప్రాంతం కోరిసినపల్లి గ్రామానికి చెందిన మహిళా కార్మికురాలు పల్లవి గత నాలుగేళ్లుగా కాలువపల్లిలోని టెక్స్‌పోర్ట్స్ గార్మెంట్స్ పరిశ్రమలో కార్మికురాలిగా పని చేస్తున్నారు. శనివారం ఫ్యాంట్ స్టిచ్చింగ్ వర్క్ సైజులో 60కి బదులుగా 61 వేసిందనే కారణంతో ఎపిఎం మురుగన్ కార్మికురాలి పల్లవిని దూషిస్తూ దాడికి పాల్పడ్డాడు. ఈ దాడితో మనోవేదనకు గురైన పల్లవి విషయాన్ని కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలియజేసింది. గార్మెంట్స్ వద్దకు చేరుకున్న కుటుంబ సభ్యులు యాజమాన్యంపై ప్రశ్నించారు. ఈ సమయంలో తమ వద్ద పనిచేస్తే ఏం జరిగినా గుట్టు చప్పుడు కాకుండా పని చేసుకోవాలని దాడులు చేసినట్లు బయటకు పొక్కితే ఉద్యోగం నుంచి తొలగిస్తామనే హెచ్చరించారు.

మహిళలపై వాదనలకు దిగుతున్న గార్మెంట్ సిబ్బంది

వివరాలు వెల్లడిస్తున్న మహిళా కార్మికురాలు పల్లవి

దీంతో కుటుంబ సభ్యులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితురాలు పల్లవి మాట్లాడుతూ సదరు ఉద్యోగి పదేపదే మహిళా కార్మికులను దూషించడం, దాడి చేయడం పరిపాటి మారిందన్నారు. మహిళలు అని చూడకుండా బూతులు తిడుతున్నారన్నారు. భోజన సమయం కూడా కేటాయించకుండా వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి అవకాశాలు పేరుతో గార్మెంట్స్‌లో లైంగిక వేధింపులకూ గురి చేస్తున్నారన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే ఉద్యోగం నుంచి తొలగిస్తున్నారన్నారు. ఇలాంటి దాడులు మునుముందు జరగకుండా కార్మిక శాఖ అధికారులు ఘటనపై విచారణ జరిపి దాడి చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు.

జాతీయ స్థాయి హ్యాండ్ బాల్‌లో శైలజ సత్తా

జెసి నుంచి సర్టిఫికెట్ అందుకున్న శైలజ

కదిరిటౌన్ : జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో కదిరి రూరల్ మండలంలోని ఎర్రదొడ్డి గ్రామ సమీపంలో ఉన్న హరీష్ స్కూల్ విద్యార్థిని శైలజ సత్తా చాటింది. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గత శుక్రవారం పుట్టపర్తిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో శైలజ జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంది. శైలజ 2024-25 విద్యా సంవత్సరంలో జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జెసి నుంచి సర్టిఫికెట్ అందుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఎంఎస్.కిరణ్, తండ్రి ప్రసన్న కుమార్ తెలిపారు. శైలజను శనివారం పాఠశాలలో ఉపాధ్యా యులు, సిబ్బంది సన్మానించి అభినందనలు తెలిపారు. శైలజకు శిక్షణ ఇచ్చి ప్రోత్సహించిన వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసన్న, ఖాదర్‌వలిలను ప్రిన్సిపల్ అభినందించారు. తమ విద్యార్థిని జాతీయ స్థాయి క్రీడల్లో రాణించడం సంతోషంగా ఉందన్నారు. శైలజ క్రీడల్లో మరింత ఉన్నత స్థాయికి చేరాలని వారు ఆకాంక్షించారు.

కూటమి పాలనలో అక్రమ కేసులు

ప్రజాశక్తి-హిందూపురం

కూటమి ప్రభుత్వ పాలనలో వైసిపి నాయకులు, కార్యకర్తలపై అకారణంగా కేసులు బనాయిస్తున్నారని దీనిని ధీటుగా ఎదుర్కోవాలని వైసిపి నియోజకవర్గ నేత వేణురెడ్డి సూచించారు. శనివారం వైసిపి కార్యాలయంలో ఆ పార్టీ న్యాయ విభాగ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వేణురెడ్డి మాట్లాడుతూ న్యాయ విభాగం ద్వారా వైసిపి కార్యకర్తలకు అన్ని విధాలా న్యాయ సహాయం అందించాలన్నారు. ఈ సమావేశంలో న్యాయవిభాగం ప్రతినిధులు రామచంద్రారెడ్డి, వెంకట రెడ్డి, ఇందాద్, వన్నేరువప్ప, కృష్ణమూర్తి, కదిరీష్, ఉదయ్ సింహారెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు బలరామిరెడ్డి, జబీవుల్లా పాల్గొన్నారు.

నిమజ్జనంలో అపశృతి

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి మండల పరిధిలోని గువ్వలగుట్టపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన వినాయక నిమజ్జనం కార్యక్రమంలో అపశతి చోటుచేసుకుంది. గ్రామంలో వినాయకుని నిమజ్జనానికి ఊరేగింపుగా ట్రాక్టర్‌లో తరలిస్తున్న సమయంలో విద్యుత్ వైర్లను తప్పించబోయి విద్యుత్ ఘాతానికి గురై గ్రామానికి చెందిన నరసింహమూర్తి(35) ట్రాక్టర్ కిందపడ్డాడు. వెంటనే గ్రామస్తులు హుటాహుటిన పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు.మతుడు విద్యుత్ వైర్లను పచ్చికట్టితో తాకినందుకే ప్రమాదం సంభవించినట్లు తెలిసింది. మతునికి భార్య లక్ష్మి, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. కృష్ణమూర్తి కదిరి పెట్రోల్ బంకులో పనిచేస్తూ జీవనం సాగించేవాడని పండుగకు గ్రామానికి వచ్చి మత్యువాత పడినట్లు గ్రామస్తులు తెలిపారు. కృష్ణమూర్తి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తమై పెనుగొండకు తరలించారు. కేసును పుట్టపర్తి రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నల్లచెరువు మండలం చెరువువాండ్లపల్లి గ్రామంలో నిమజ్జనానికి వెళ్లిన సమయంలో రోహిత్ అనే బాలుడు నీటిలో పడ్డాడు. స్నేహితులు గమనించి నీటి నుంచి బయటకు తీశారు. వెంటనే అతన్ని చికిత్స అనంతపురం తరలించారు. ప్రస్తుతం బాలుని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సమాజంలో రుగ్మతలను దూరం చేద్దాం

అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

ప్రజాశక్తి-హిందూపురం

సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాలు, బాల్య వివాహాలు తదితర రుగ్మతులను రూపమాపడం అందరి బాధ్యత అంటూ అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ పేర్కొన్నారు. ఆడపిల్లల కదలికలపై తల్లిదండ్రులు ప్రత్యేక దష్టి సారించాలన్నారు. శనివారం హిందూపురం రూరల్ మండల పరిధిలోని కిరికెర వినాయక నగర్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను బాగా చదివించి ఉత్తములుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రస్తుతం మాదకద్రవ్యాలు సమాజాన్ని పట్టిపీడిస్తున్నాయని, వాటి నిర్మూలనకు అందరూ కషి చేయాలన్నారు. మాదకద్రవ్యాలు వాడటం వల్ల అనారోగ్యానికి గురి కావడంతో పాటు సమాజంపై అనేక దుష్పరిణామాలు చోటుచేసుకుంటాయన్నారు. ఆడపిల్లలకు 18 సంవత్సరాలు రాకుండానే వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టాలు అమలులో ఉన్నాయని, వాటిని సక్రమమైన పద్ధతిలో వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రులను పోషించడం కుమారులతో పాటు కుమార్తెలకు కూడా బాధ్యత ఉంటుందన్నారు. చట్టం దష్టిలో అందరూ సమానమేనని, ప్రతి ఒక్కరూ చట్టం, న్యాయం పట్ల అవగాహన పెంచుకొని సమాజాభివద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహాశీల్దార్ మైనుద్దీన్, సర్పంచి భాగ్యమ్మ, న్యాయవాదులు కళావతి, సంతోషి కుమారి, రవిచంద్ర, కార్యదర్శులు సూర్యప్రకాష్, నరేష్, లోక్‌అదాలత్ హేమావతి పాల్గొన్నారు.

దిగువపల్లితండాలో న్యాయ విజ్ఞాన సదస్సు

చిలమత్తూరు : మండలంలోని దిగువపల్లితండా గ్రామంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. హిందూపురం సీనియర్ సివిల్ జడ్జి వెంకటేష్‌నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలం దరూ బాగా చదువుకోవాల్సిన ఆవశ్యకతను తెలిపారు. ఒక వ్యక్తి ఉన్నత స్థానానికి ఎదగడానికి, మంచి ఉద్యోగాలు పొందడానికి విద్య అవకాశాలు కల్పిస్తుందన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని సూచించారు. ప్రజలు న్యాయ సూత్రాలు, ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు తెలుసుకొని, చట్టానికి లోబడి క్రమశిక్షణతో జీవించాలని పిలుపునిచ్చారు. సదస్సులో డిప్యూటీ తహాశీల్దార్ బి.జగన్నాథ్, ఎంపిడిఒ రమణమూర్తి, హిందూపురం న్యాయవాదులు రవి, కృష్ణమూర్తి, పోలీసులు, సర్పంచి నీలాబాయి, హిందూపురం మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ చంద్రనాయక్, ప్రజలు పాల్గొన్నారు.

ఎలాంటి సమస్యలూ తలెత్తకూడదు..

ఎమ్మెల్యే ఎంఎస్.రాజు

ప్రజాశక్తి-మడకశిర

నగర పంచాయతీ పరిధిలో ఎక్కడా ఎలాంటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి కౌన్సిలర్లు, సచివాలయ ఉద్యోగులు సమన్వయంతో పని చేయాలన్నారు. పట్టణంలోని కౌన్సిల్ హాలులో శనివారం మున్సిపల్ ఛైర్మన్ రాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ అవసరం ఉన్న చోట తప్పకుండా వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. రూ. 80 వేల లోపు ఉన్న పనులకు కూడా టెండర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామన్నారు. వైసిపి పాలనలో ఏ ఒక్క అభివృద్ధి కార్యక్ర మం కూడా చేపట్టకుండా, వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. జగన్ పాలనలో ప్రజాప్రతినిధులు జవాబు దారీతనంతో పని చేసి ఉంటే ఇప్పుడు ప్రజలకు ఇన్ని సమస్యలు ఉండేవి కాదన్నారు. కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన ప్పటి నుంచి అంచెంచలుగా ప్రణాళికాబద్ధంగా ఒక్కో అభివృద్ధి కార్యక్రమం చేపడుతున్నామన్నారు. నగర పంచాయతీ సిబ్బంది, విద్యుత్ అధికారులు సమన్వయం చేసుకొని లో వోల్టేజీ సమస్యను అధిగమించాలన్నారు. గతంలో రూ. 99 వేలకు పైగా చేసిన పనులన్నింటిపై విజిలెన్స్ ఎంక్వైరీ జరగాలన్నారు. వర్షాకాలం కావున దోమల నివారణకు ప్రతి వార్డులో ప్రతిరోజూ ఫాగింగ్ చేయాలన్నారు. అంబేద్కర్ సర్కిల్, రాజీవ్ గాంధీ సర్కిల్, జ్యోతిరావుపూలే సర్కిల్‌లో వీధి లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. చర్చి కాంపౌండ్‌లో వర్షం నీరు ఇళ్లలోకి వెళ్లకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. అలాగే తాగునీరు, డ్రెయినేజీ, వీధి దీపాలు, తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం గ్రీన్ అంబాసిడర్లకు భద్రత జాకెట్లు పంపిణీ చేశారు. సమావేశంలో రాష్ట్ర ఒక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ ఛైర్మన్ రాజు, వైస్ ఛైర్మన్, వెంకటలక్ష్మమ్మ, ప్రభావతి, మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, హాజరయ్యారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

నియోజకవర్గ వ్యాప్తంగా 44 మంది లబ్ధిదారులకు సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 4.52 లక్షల విలువైన చెక్కులను తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఎంఎస్.రాజు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, మండల కన్వీనర్లు నాగరాజు, లక్ష్మీనరసప్ప, ఈరన్న, తిప్పేస్వామి, నాగరాజు, జడ్పిటిసి ఉమేష్, సింగిల్‌విండో అధ్యక్షులు, సభ్యులు, కౌన్సిలర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

ప్రణాళికాబద్ధంగా విద్యాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రణాళికాబద్ధంగా విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని బుక్కపట్నం డైట్ కళాశాల అధ్యాపకులు సూచించారు. శనివారం ముద్దిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యారాలు సుధామణి అధ్యక్షతన జరిగిన క్లస్టర్ సమావేశానికి డైట్ కళాశాల అధ్యాపకులు ఆదర్శ్, ప్రభాకర్ లు పరిశీలకులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారిన నూతన సిలబస్‌కు అనుగుణంగా విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. అందుకోసం ఉపాధ్యాయులు తప్పనిసరిగా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. విద్యార్థులను ప్రస్తుత పరీక్షల అసెస్‌మెంట్ పుస్తకాలకు అలవాటు చేయాలన్నారు. మండల విద్యాశాఖ అధికారి గంగప్ప సి,డి గ్రూప్ విద్యార్థులను ఏవిధంగా ఏ, బి గ్రూపులకు మార్చాలో తెలియ చేశారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయురాలు వహీదా ఖానం, భారతీ, ఉపాధ్యాయులు క్లస్టర్ కార్యదర్శి కొండయ్య, శేషారెడ్డి, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న ఆదర్శ్

పెనుకొండలో పరిటాల రవి విగ్రహావిష్కరణ

పాల్గొన్న మంత్రి సవిత, ఎంపి పార్థసారథి, ఎమ్మెల్యేలు సునీత, అమిలినేని, రాజు

ప్రజాశక్తి-పెనుకొండ

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పరిటాల రవీంద్ర తన జీవితాన్ని త్యాగం చేశారని, పేదల గుండెల్లో ఆయన చిరస్థాయిగా నిలిచిపోయారని రాష్ట్ర మంత్రి ఎస్.సవిత, ఎంపి బికె. పార్థ సారథి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, అమిలినేని సురేంద్రబాబు, ఎంఎస్.రాజు, ధర్మవరం నియోజక వర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. పట్టణంలోని దర్గా సర్కిల్ వద్ద మంత్రి సవిత సహకారంతో ఏర్పాటు చేసిన పరిటాల రవి కాంస్య విగ్రహాన్ని శనివారం పరిటాల రవి జయంతి సందర్భంగా వారు ఆవిష్కరించారు. మంత్రి సవిత మాట్లాడుతూ పరిటాల రవి పోరాట స్ఫూర్తిని భావితరాలకు తెలపాలనే సంకల్పంతో పట్టణంలో విగ్రహం ఏర్పాటు చేశామన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎన్టీఆర్ ఎంతో కషి చేశారని, ఆయన బాటలో నడిచిన పరిటాల రవి కూడా పేదల కోసం తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేశారన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా పెనుకొండ పేరు చెబితే పరిటాల రవి గుర్తుకు వస్తారని తెలిపారు. పరిటాల రవి చూపిన దారిలోనే ఎమ్మెల్యే సునీత, తనయుడు శ్రీరామ్ పని చేస్తూ, పేదల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారని వారు కొనియాడారు. అంతకుముందు పట్టణంలోని హెచ్‌పి పెట్రోల్ బంక్ నుంచి దర్గా సర్కిల్ వరకూ మంత్రి సవిత ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించగా ఎమ్మెల్యేలు సునీత, అమిలినేని సురేంద్రబాబు, పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. జోహార్ రవన్న అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజనప్ప, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, రాష్ట్ర ఉప్పర కార్పొరేషన్ ఛైర్మన్ వెంకటరమణ, రాష్ట్ర యాదవ, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్లు కేశవయ్య, శ్రీనివాసులు, నాయకులు నారాయణస్వామి, చిన్నప్పయ్య, వెంకట రాముడు, సింగిల్‌విండో అధ్యక్షులు పోతిరెడ్డి, పట్టణ, మండల పార్టీ కన్వీనర్లు శ్రీరాములు, ఈశ్వరప్రసాద్, ప్రజాప్రతినిధులు, కూటమి శ్రేణులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



పరిటాల రవి విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి సవిత, ఎంపి పార్థసారథి, ఎమ్మెల్యే పరిటాల సునీత

పల్లె ఉమకు నివాళి

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ బాలాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యాసంస్థల అభివృద్ధిలో పల్లె ఉమ సేవలు అమోఘం అని సప్తగిరి ఎంబిఎ కళాశాల ప్రిన్సిపల్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం పల్లె ఉమ 7వ వర్ధంతి కార్యక్రమాన్ని కళాశాల ఆవరణంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె, చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కొడిగేపల్లి అంధుల పాఠశాలలో విద్యార్థులకు పాలు బ్రెడ్లు పంపిణీ చేశారు. కొట్నూరు నిర్మల వద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్ రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మంజునాథ్, కళాశాల పరిపాలనాధికారి గంగిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందూపురంలో పల్లె ఉమకు నివాళులర్పిస్తున్న సప్తగిరి ఎంబిఎ కళాశాల సిబ్బంది

పెనుకొండ టౌన్ : పట్టణంలోని శ్రీసత్యసాయి క్యాంపస్‌లో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఆదిశేషారెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గంగాధర్ ఆధ్వర్యంలో(శ్రీ బాలాజీ ఎడ్యుకేషన్ సొసైటీ) పల్లె ఉమ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ప్రిన్సిపల్స్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి పల్లె ఉమ ఆశలను నెరవేర్చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ఏఓ స్వామి కేశవయ్య, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి సతీమణి పల్లె ఉమ ఏడో వర్ధంతి వేడుకలను శనివారం అనంతపురంలోని పల్లె వ్యవసాయ పొలంలో ఆమె ఘాట్ వద్ద ఘనంగా నిర్వహించారు. దీంతో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వాహనాల్లో అధిక సంఖ్య లో తరలి వెళ్లి పల్లె ఉమ ఘాట్ వద్ద నివాళు లర్పించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, ఎస్.శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామకృష్ణ, శ్రీనివాసులు, నాయకులు కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, లక్ష్మీనారాయణరెడ్డి, రాజు పాల్గొన్నారు.

నల్లమాడ : టిడిపి మండల నాయకులు వాహనాల్లో అనంతపురం వెళ్లి పల్లె ఉమ సమాధి వద్ద నివాళులర్పించారు. అక్కడ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, కొట్లో మంజురెడ్డి, తదితరులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో యనమల పెద్దప్పయ్య నాయుడు, వై.గంగులప్పనాయుడు, పి.అశ్వక్‌ఖాన్, కె.లక్ష్మన్న, కృష్ణమూర్తి, ఆశాది గంగులప్ప, గందోడి భాస్కర్, అరవింద్ బాబు, పాపారాయుడు, శివప్రసాద్‌రెడ్డి, ఎ.నారాయణస్వామి, బి.రామిరెడ్డి, కె.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పెనుకొండలో పల్లె ఉమకు నివాళులర్పిస్తున్న శ్రీసత్యసాయి కళాశాల సిబ్బంది

నేడు శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

వారాంతపు సెలవు సందర్భంగా స్థానిక శిల్పారామంలో ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం పాలన అధికారి ఖాదర్‌వలి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయం త్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకూ వివిధ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. శ్రీ నృత్యోదయ నాట్య కళా నిలయం ముంబై వారిచే భరతనాట్యం, కూచిపూడి, తదితర నృత్యాలు ఉంటాయన్నారు. గురువు జయశ్రీ ఆధ్వర్యంలో 12 మంది శిష్య బృందం పాల్గొంటారన్నారు. పట్టణ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు వారాంతం సెలవు రోజున ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపేందుకు ఈ కార్యక్రమం చేపట్టమన్నారు. ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

విటమిన్ మాత్రలు పంపిణీ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని రుషి విద్యాలయంలో శనివారం ఉపాధ్యాయులకు విటమిన్ మాత్రలు పంపిణీ చేసినట్లు హెచ్‌ఎం కరణ్ స్వరూపాసింగ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఆరోగ్యకరమైన జీవనానికి ఐరన్, క్యాల్షియం, మల్టీ విటమిన్ టాబ్లెట్లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఉపాధ్యాయులు బాగుంటేనే సమాజం బాగుంటుందని, ఉపాధ్యాయులు కూడా ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతోనే ఈ మాత్రలు పంపిణీ చేశామని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు హెచ్‌ఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ భాస్కర్‌రెడ్డి, సిఇఒ రవీంద్ర, ఏవో రంగారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

విటమిన్ మాత్రలు అందుకున్న ఉపాధ్యాయ బృందం

అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న ఎస్‌యుసిఐ నాయకులు

ఓటర్ల సవరణ బిల్లుతో నష్టం

ప్రజాశక్తి-హిందూపురం

ఎన్నికల సంఘం ఉద్దేశపూర్వకంగా తీసుకొచ్చిన ఓటర్ల సవరణ బిల్లు నష్టదాయకం అని దీనిని అందరూ వ్యతిరేకించాలని ఎస్‌యుసిఐ నాయకులు పేర్కొన్నారు. శనివారం కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎం.గిరీష్ మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ (ఈసిఐ) బీహార్ రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కింద ఓటర్ల జాబితా సవరణను చేపట్టడం సరైంది కాదన్నారు. ఇది ప్రజల హక్కులను హరించేదిలా ఉందన్నారు. దీనిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామకష్టారెడ్డి, మల్లిక్ దత్, అశోక్, రంగనాయకులు, పూజిత తదితరులు పాల్గొన్నారు.

ఎపిజిబి మేనేజర్‌గా భవానీ

ప్రజాశక్తి-నల్లచెరువు

స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్(ఎపిజిబి)గా భవానీ శనివారం బాధ్యతలు స్వీకరిం చారు. చిత్తూరు జిల్లాలో పని చేస్తున్న ఈమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. నూతన మేనేజర్ మాట్లా డుతూ బ్యాంకులో ఎల్లవేళలా అందుబాటులో వినియోగదారులకు ఎలాంటి సమస్య రాకుండా చూస్తామన్నారు. గతంలో ఇక్కడ పని చేసిన మేనేజర ప్రభావతి బదిలీపై పత్తికొండకు వెళ్లారు.

అట్టహాసంగా గణేష్ నిమజ్జనం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో శనివారం గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పట్టణంలో యువత కోలాహలం మధ్య గణేష్ నిమజ్జన ఊరేగింపు సాగింది. వినాయకుడి ప్రతిమలను ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లలో కొలువు ఉంచి యువత కేరింతల మధ్య ఉత్సాహంగా ఊరేగించారు. మధ్యాహ్నం 3 గంటలకు సత్యసాయి విద్యార్థులు వివిధ రకాల వినా యకుల ప్రతిమలను ఊరేగిస్తూ ప్రశాంతి నిలయానికి చేరుకున్నారు. పట్టణంలో వాడవాడలా వెలసిన వినాయకుల ఊరేగింపు సాయంత్రం 4:30 గంటలకు ప్రారంభమైంది. పట్టణంతో పాటు గోకులం, ఎనుములపల్లి గణేష్ సర్కిల్‌లో ప్రతిష్టించిన వినాయకులను కూడా ఊరేగించారు. అనంతరం సమీపంలోని సాహెబ్ చెరువు, ఎనుములపల్లి చెరువుల్లో నిమజ్జనం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ డీఎస్పీ విజయ్ కుమార్ పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీలోని పలు గ్రామాల్లో ఆదివారం నిమజ్జనం చేయనున్నట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

కొత్తచెరువు : స్థానిక కమ్మపాలెం, వడ్డెర కాలనీ, బిసి కాలనీ, బుక్కపట్నం రోడ్డు, పుట్టపర్తి రోడ్డు, పెనుగొండ రోడ్డు, ధర్మవరం రోడ్డు, పాత తహశీల్దార్ కార్యాలయం, తదితర వీధుల్లో 40కి పైగా వినాయకుడి ప్రతిమలను ట్రాక్టర్లలో కొలువు దీర్చి డప్పు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల, యువకుల కేరింతల మధ్య పురవీధుల గుండా ఊరేగించారు. నెహ్రూ కూడలి మీదుగా వెళ్లి నాగులకణం వద్ద బుక్కపట్నం చెరువులో నిమజ్జనం చేశారు. సిఐ మారుతిశంకర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

లడ్డూ ప్రసాదం వేలం

రైల్వే స్టేషన్ రోడ్డులో నితీష్‌చౌదరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని ప్రతిమ వద్ద శనివారం సాయంత్రం లడ్డూ ప్రసాదం వేలం వేశారు. మొత్తం మూడు లడ్డూలు వేలం వేయగా రూ. 93 వేలకు జయచంద్రనాయుడు, పవన్, ఫిష్ మార్కెట్ మణి దక్కించుకున్నారు. విజయనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద లడ్డూను రూ. 30 వేలకు సర్పంచి రాజా నాగరాజు దక్కించుకున్నారు.

నల్లచెరువు : మండలంలోని పలు గ్రామాల్లో గణేష్ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి సమీప చెరువులు, కుంటలు, వాగుల్లో నిమజ్జనం చేశారు. ఊరేగింపులో మహిళలు, యువతీ, యువకులు పెద్దఎత్తున పాల్గొని ఉత్సాహంగా రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేశారు. చెరువువాండ్లపల్లి చెరువులో కాలుజారి ముగ్గురి యువకులు నీటిలో పడిపోయారు. రోహిత్ అనే యువకుడికి ఈత రాక నీటిలో మునిపోగా తోటి స్నేహితులు బయటికు తీసి ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుంచి అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం అతడి పరిస్థితి మెరుగ్గానే ఉన్నట్లు సమీప బంధువులు తెలిపారు.

ధర్మవరం రూరల్ : పట్టణంలో ఏర్పాటు చేసిన గణేష్ ప్రతిమలను పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులో నిమజ్జనం చేశారు. చెరువు వద్ద ఓ క్రేన్ ఏర్పాటు చేసి దాని సహా యంతో గణనాథుల విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేశారు. వన్ టౌన్ సిఐ నాగేంద్రప్రసాద్ మాట్లా డుతూ ఎస్పీ రత్న ఆదేశాల మేరకు డీఎస్పీ హేమంత్ కుమార్ సూచనలతో నిమజ్జనం కార్యక్రమం పకడ్బందీగా జరిగేలా చర్యలు చేపట్టామన్నారు. చెరువు వద్ద గజఈతగాళ్లను అందు బాటులో ఉంచామని తెలిపారు. ఊరేగింపు, నిమజ్జనం సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందో బస్తు ఏర్పాటు చేశామన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామ న్నారు. ఇందుకు సహకరించిన రెవెన్యూ, మున్సిపాలిటీ యంత్రాంగానికి ధన్యవాదాలు తెలిపారు. మల్లాకాల్వ గ్రామంలో గణేష్ నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. వినాయకుని ప్రతిమ వద్ద ఉంచి నాలుగు రోజులు పూజలు నిర్వహించిన లడ్డూ ప్రసాదాన్ని వేలం వేయగా సి. రామ్మోహన్‌రెడ్డి రూ.10వేలకు దక్కించుకొన్నారు. అనంతరం భక్తుల కోలహలం మధ్య గణేశున్ని ఊరేగింపుగా తీసుకెళ్లి చిత్రావతి నదిలో నిమజ్జనం చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పల్లె రామ్మోహన్‌రెడ్డి, నారాయణరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, పాల్గొన్నారు,

పుట్టపర్తిలో గణేష్ విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

అలరించిన చిన్నారుల నృత్యాలు

హిందూపురం : వినాయక పర్వదినం సందర్భంగా హిందూపురం పట్టణంలో ఏ వీధిలో చూసిన బొజ్జ గణపయ్యలు దర్శనమిస్తున్నాయి. పట్టణంలోని కంసల పేటలో వెలిసిన చత్రపతి గణేష్ మండల్ వినాయకునికి 'వక్రతుండ మహా కాయ కోటి సూర్య సమప్రభ అంటూ విఘ్నాలను తొలగించే వినాయకుని నామస్మరంతో నిర్వహించిన సాంస్కతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. చిన్నారులు భరతనాట్యం, కూచిపూడి, శివతాండవం లాంటి పాటలకు నత్య, నాట్య ప్రదర్శనలు చేశారు. ఈ ప్రదర్శనలను తిలకించేందుకు భక్తులు బారులు తీరారు. అలాగే ఇంటర్ విద్యార్థిని, నాట్య మయూరి అవార్డు గ్రహీత వైష్ణవి సాంస్కతిక నాట్య ప్రదర్శన ప్రత్యేకతను చాటుకుంది. నాట్య ప్రదర్శన చేసి భక్తులను తిలకింపచేసిన చిన్నారులకు ఇస్కాన్ భక్త బందం ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. తొమ్మిది రోజులపాటు ఈ విగ్రహానికి ప్రత్యేక పూజలు గావించి ప్రతిరోజు అనేక సాంస్కతిక కార్యక్రమాలు, భక్తి గీతాలు, భగవద్గీత లాంటి శ్లోకాలను భక్తులకు కనువింపు చేస్తున్నారు. హిందూపురం పట్టణంలో పలుచోట్ల కొలువైన పెద్ద పెద్ద వినాయక ప్రతిమలు ఆకర్షణగా నిలుస్తున్నాయి.

పండుగ సందడి..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వినాయక చవితి పండుగ సందడి అంతటా కోలాహలంను నింపింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో వాడవాడలా వినాయక చవితి పండుగ సంబరాలు కనిపించాయి. గ్రామీణ ప్రాంతాల్లో మూడు రోజులపాటు వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి నిమజ్జనాలు పూర్తయ్యాయి. అనంతపురం నగరంలో మాత్రం ఐదు రోజులకు నిమజ్జనం జరుగనుంది. పెద్దఎత్తున విగ్రహాల ఏర్పాటు జరిగాయి. ఇందులో ఎక్కడా అవాంఛానీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచనలు చేశారు. ఒకటి, రెండు చోట్ల అపశృతులు చోటు చేసుకున్నాయి. పుట్లూరులో విద్యుత్ షాక్‌తో వినాయక మంటపం వద్ద ఒక యువకుడు మృతి చెందారు. ఇక బుక్కరాయ సముద్రంలో పోలీసులు, దళితుల మధ్య పెద్దఎత్తున ఘర్షణ చోటు చేసుకుంది. ఊరేగింపును అడ్డుకునే క్రమంలో జరిగిన ఘర్షణలో దళితులపై పోలీసులు లాఠీఛార్జీ చేశారు. ఇక అనంతపురం నగరంలో ఆదివారం నాడు నిమజ్జనం జరుగనుంది. నగరంలో వందల సంఖ్యలో మంటపాలున్నాయి. ఈ విగ్రహ నిమజ్జన సమయంలో ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ట్రాఫిక్ ఆంక్షలతోపాటు, తగిన సూచనలను నిర్వాహకులు జిల్లా యంత్రాంగం చేసి ఉంది. మరోవైపు నిర్వాహకులు ప్రతి మంటపం వద్ద భారీ ఎత్తునే ఏర్పాట్లు చేసి ఉండటం గమనార్హం. విద్యుత్ దీపాలంకరణలతోపాటు, వివిధ రూపాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు. నిమజ్జనానికి డిజెలతోపాటు, డప్పులను భారీగా సమకూర్చుకుంటున్నారు. మొత్తంగా ఈవారంలో ఎక్కడ చూసినా వినాయక చవితి సందడి వాడవాడల్లో కనిపించింది.

ఉమ్మడి జిల్లాలో బార్ లైసెన్సుల కోసం టెండర్లు జరిగాయి. ఈ టెండర్లలో పాల్గొన్న వారి సంఖ్య పెద్దగా లేకపోవడంతో కొన్నింటి మరోమారు టెండర్లు నిర్వహించాలని తలపెట్టారు. ఈ ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. డీఎస్సీ నియామకాలకు సంబంధించి అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన జరిగింది. గడిచిన మూడు రోజులుగా ఈ ప్రక్రియ సాగింది. అభ్యర్థులకు మెసేజ్ రావడంలో కొంత సమస్య ఎదురైనప్పటికీ దాదాపుగా సజావుగానే ప్రక్రియ కొనసాగింది. గత వారంలో అనంతపురం జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఇందులో కొన్ని అంశాలే చర్చకు వచ్చినట్టు విమర్శలున్నాయి. వర్షాభావం, ప్రత్యామ్నాయ పంటల సాగు, గతేడాది పంటనష్టానికి సంబంధించిన పరిహారం ఎప్పుడు ఇస్తారన్న అంశాలేవీ ఇందులో చర్చ జరగలేదు. సాగునీటిపై చర్చ జరిగినప్పటికీ ప్రధానంగా హంద్రీనీవా ప్రధాన కాలువ వెడల్పుపైనే జరిగింది. ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయడం జరుగుతుందని మంత్రులు చెప్పారు. పరిశ్రమలు కూడా జిల్లాకు తీసుకొస్తామని ప్రకటించారు. ఇదిలాగుంటే ఖరీఫ్ ముగుస్తున్నా ఐఎబి సమావేశం మాత్రం ఇప్పటికీ పూర్తవలేదు. ఖరీఫ్‌కే ఈ ఏడాది నీళ్లు అని అధికారులు చెబుతున్న నేపథ్యంలో ఆయకట్టు దిగువనున్న మిడ్‌పెన్నార్ దక్షిణ, ఉత్తర కాలువల కింద ఆయకట్టు రైతుల పరిస్థితి ఏమిటన్న దానిపై స్పష్టత లేదు. సాగునీరు అధికంగా వచ్చిన సమయంలోనూ నీటి నిర్వహణపై సరైన స్పష్టత లేకుండా ఉండటం పట్ల రైతుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

సమావేశంలో మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం నాయకులు

వార్డెన్‌కు పట్టని బిసి హాస్టల్ నిర్వహణ

ప్రజాశక్తి-నంబులపూలకుంట

స్థానిక బిసి బాలుర వసతి గృహాన్ని ఫంక్షన్ హాల్‌గా మార్చారని సిపిఎం, ఎపి రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి, సోమిరెడ్డి విమర్శించారు. ఎన్‌పి.కుంటలో శనివారం వారు విలేకరుల సమా వేశంలో మాట్లాడుతూ ఈ హాస్టల్‌లో ఏటా 200 మందికి పైగా విద్యార్థులు ఉండేవారని, ప్రస్తుతం 37 మంది ఉన్నారన్నారు. దీంతో వార్డెన్ వసతి గృహం వైపు కన్నెత్తి చూడడం లేదన్నారు. వసతి గృహా న్ని ప్రైవేటు వ్యక్తులకు, ఓ ప్రైవేట్ ట్యూటర్‌కి అప్పజెప్పినట్లు తెలుస్తోందన్నారు. ఇలాంటి అధికారుల వల్ల వసతి గృహాన్ని మూసివేసే దుస్థితి తలెత్తుతుందన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందజేయకపోగా ప్రైవేటు వ్యక్తుల విలాసాలకు వంటా వార్పు చేసి సహకరిస్తున్నట్లు తెలిపారు. దీంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఈ హాస్టల్‌లో చేరడానికి మొగ్గు చూపడం లేదన్నారు. ఇకనైనా జిల్లా అధికారులు స్పందించి వార్డెన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులు పోటీ పడి చదవాలి : ఎంఇఒలు

ప్రజాశక్తి-గుడిబండ

ప్రతి విద్యార్థి కార్పొరేట్ కళాశాలలకు దీటుగా చదివి నీట్, ఎంసెట్ పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించాలని ఎంఇఒలు ప్రసాద్‌రెడ్డి, రవిచంద్రకుమార్ సూచించారు. స్థానిక మహాత్మ జ్యోతిబా పూలే కళాశాలలో శనివారం వారు ప్రిన్సిపల్ ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం కళాశాల అధ్యాపకుల బృందం, విద్యార్థులు కలిసి కళాశాలలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులు సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి-కొత్తచెరువు

పంటల సాగులో రైతులు సస్యరక్షణ పద్ధతులను తప్పనిసరిగా పాటించాలని జిల్లా వనరుల కేంద్రం డిడిఎ శ్రీరామ్‌నాయక్ సూచించారు. మండలంలోని పోతులకుంట రైతు సేవా కేంద్రంలో శనివారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయ అధికారులు రైతులకు పంటల సాగులో పలు సూచనలు, సలహాలు చేశారు. ప్రధానంగా వేరుశనగ, కంది, వరి, మొక్కజొన్న పంటల సాగులో మెలకువలు పాటించాలన్నారు. అనంతరం గ్రామ సమీపంలోని పంట పొలాలను పరిశీలించి దిగుబడి పెంచడం, చీడపీడలు, నివారణ మందుల గురించి వివరించారు.



పంటల సాగులో సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ట్రాన్స్‌జెండర్‌పై దాడి.. కేసు నమోదు

ప్రజాశక్తి-కదిరిటౌన్

పట్టణంలో ట్రాన్స్‌జెండర్‌పై దాడి చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. వివరాలు.. పట్టణంలోని గజ్జలరెడ్డిపల్లికి చెందిన బంగారు సానియా అలియాస్ సురేష్(ట్రాన్స్‌జెండర్)ను పట్టణానికి చెందిన ఈశ్వరయ్య, నారాయణస్వామి, సుజాత, సుమతి అవహేళన చేశారు. దీనిపై సానియా వారిని నిలదీయగా వారు దాడి చేసి గాయపరిచారు. బాధితురాలు సానియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా తమ పట్ల చులకనభావం ఎందుకని, అవహేళన చేయడం తగదని ట్రాన్స్‌జెండర్ల నాయకులు చందు పేర్కొన్నారు. తాము పొట్టకూటి కోసం భిక్షాటన చేస్తూ, శుభాకార్యలకు వెళ్లి డ్యాన్సులు చేస్తూ జీవనం సాగిస్తున్నామని, తమను కూడా సమాజంలో మనుషులుగా గుర్తించాలని కోరారు. ప్రభుత్వాలు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, తమకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

పరిటాల రవికి నివాళి

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్/ధర్మవరం/కదిరి/బత్తలపల్లి

మాజీమంత్రి పరిటాల రవీంద్ర జయంతి సందర్భంగా శనివారం టిడిపి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల ఆయన చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పెనుకొండ పట్టణంలోని ఎంపి బికె.పార్థసారథి నివాసంలో ఎంపి పార్థసారథి, అల్లుడు శశిభూషణ్‌పటేల్, టిడిపి శ్రేణులు పరిటాల రవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎంపి మాట్లాడుతూ ప్రజల గుండెల్లో పరిటాల రవి చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ధర్మవరం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో నాయకులు సందా రాఘవ, పరిసే సుధాకర్, మహేష్‌చౌదరి, నాగూర్‌హుస్సేన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచి పెట్టారు. అక్కడే పేదలకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. కదిరి పట్టణంలోని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కార్యాలయంలో టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్ ఆధ్వ ర్యంలో నాయకులు పరిటాల రవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బత్తలపల్లిలోని టిడిపి కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి నెట్టెం రమణ, మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ ముల్లగూరు అయ్యప్ప ఆధ్వర్యంలో పరిటాల రవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచి పెట్టారు.

పరిటాల రవికి నివాళులర్పిస్తున్న ఎంపి, టిడిపి నాయకులు

నేరాలు ఘోరాలు

రూ. 5 లక్షల నగదు చోరీ

ప్రజాశక్తి-గాండ్లపెంట

మండలంలోని గొడ్డువెలగల పంచాయతీ పరిధిలోని పల్లెవాండ్లపల్లి గ్రామంలో వాసుదేవ్ ఇంట్లో శుక్రవారం సాయంత్రం చోరీ జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు శనివారం క్లూస్ టీం, పోలీసులు ఆ గ్రామం వెళ్లి ఆధారాలు సేకరించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. వాసుదేవ్ పశువులు మేపుతూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో కొన్ని పశువులు, పేడఎరువు విక్రయించగా వచ్చిన సొమ్ముతో పాటు దాచుకున్న నగదు కలిపి సుమారు రూ. 5 లక్షల ఇంట్లో ఉంచి శుక్రవారం యథావిధిగా పశువుల పాక వద్దకు వెళ్లాడు. సాయంత్రం 7 గంటల సమయంలో పశువులను తీసుకుని ఇంటికి చేరుకోగా తలుపులు తెరిచి ఉండడం చూసి గాబరాగా లోపలికి వెళ్లి పరిశీలించాడు. బీరువా పగలగొట్టి అందులో ఉన్న నగదు రూ. 5 లక్షలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. అతడి ఫిర్యాదు మేరకు క్లూస్ టీంతో చోరీ జరిగిన ఇంటికి వెళ్లి పరిశీలించామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

భూ తగాదాలో జర్నలిస్ట్‌పై దాడి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మండలంలోని వీరాంజనేయపల్లిలో చోటుచేసుకున్న ఓ భూ తగాదాలో జర్నలిస్ట్ సతీష్‌బాబుపై అదే గ్రామానికి చెందిన నాగేంద్ర దాడికి పాల్పడ్డారు. శనివారం బాధిత రిపోర్టర్ కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. వీరాంజనేయపల్లిలో సర్వే నెంబర్ 518-1లో 2.19 ఎకరాలను నాగేంద్ర దౌర్జన్యంగా జెజిబితో శుభ్రం చేయిస్తున్నారు. విషయం తెలుసుకున్న సతీష్‌బాబు తన అన్న కొడుకు ప్రశాంత్‌తో కలిసి అక్కడికి వెళ్లి ఆర్డీవో కోర్టులో ఉన్న భూమిలో ఎలా పనులు చేస్తారని ప్రశ్నించారు. ఇంతలో నాగేంద్ర మరో 20 మందితో కలిసి సతీష్‌తో పాటు, ఆయన అన్న కొడుకుపై దాడి చేశారు. సతీష్ తలపై కొట్టడంతో స్పృహ కోల్పోయి పడిపోయారు. దీంతో ప్రశాంత్ తన కుటుంబ సభ్యులతో కలిసి హుటాహుటిన సత్యసాయి జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు.

వైద్యుడు, సిబ్బందిపై దాడి కేసులో నిందితులు అరెస్ట్

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో విధుల్లో ఉన్న డాక్టర్, వైద్య సిబ్బందిపై ఈ నెల 27వ తేదీ రాత్రి దాడి చేసి హత్యాయత్నానికి ప్రయత్నించిన నిందితులను శనివారం అరెస్ట్ చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. సిఐ తెలిపిన వివరాలు.. కేసు దర్యాప్తులో భాగంగా డీఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో కుటాగుళ్ల రైల్వేగేట్ సమీపంలో దేవిశెట్టి అనిల్ కుమార్, జొళ్ల సాయి గణేష్‌యాదవ్, రేకే రాజశేఖర్, కనుంపల్లి భరత్, అగ్రహారం కార్తీక్, కొమ్మద్ది మణికంత, దేరంగుల అశోక్‌లను అరెస్ట్ చేశామన్నారు. ఈ కేసులో సీసీ ఫుటేజ్ ఆధారంగా మరి కొందరు నిందితులను గుర్తించామని, వారు పరారీలో ఉన్నారని, వారిని కూడా వీలైనంత త్వరగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపుతామన్నారు.

ఒత్తిడికి దూరంగా ఉండాలి : మానసిక వైద్య నిపుణురాలు

ప్రజాశక్తి-హిందూపురం

ఒత్తిడికి దూరంగా ఉండటం వల్ల ఎలాంటి ఇబ్బందులూ లేకుండా విధులు నిర్వహించవచ్చని స్థానిక ప్రభుత్వాసుపత్రి మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ జీవన పేర్కొన్నారు. శనివారం విప్రో కేర్స్ సహకారంతో వాసవి మహిళా మండలి, కుశల్ ఆరోగ్య కేంద్రం తుమకుంట పారిశ్రామిక వాడలోని విప్రో ఓల్డ్ ప్లాంట్ ఉద్యోగులకు ఒత్తిడి నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జీవన మాట్లాడుతూ అధిక పని భారం, సమయపట్టికలు, పని-వ్యక్తిగత జీవన సంతులనం లోపం వల్ల ఒత్తిడి పెరిగే అవకాశం ఉంటుందన్నారు. క్రమమైన వ్యాయామం, సరైన ఆహారం, విశ్రాంతి పద్ధతులు పాటించడం ద్వారా ఒత్తిడిని తగ్గించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో విప్రో ప్లాంట్ మాచయ్య, కాంతి కిరణ్, హెచ్‌ఆర్ కొండలరావు, ట్రైనింగ్ ఆఫీసర్ గురుదత్, వైద్యులు సల్మా, మరియమ్, కోఆర్డినేటర్ శిరీష, లలిత తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ జీవన

మహారాజశ్రీ గౌరవనీయులైన అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు, కదిరి

I.A. No.752/2024 in O.S.No.596/2024

Between:
టి.గంగిరెడ్డి ...వాది
మరియు
చింతకాయల నారాయణస్వామి ...ప్రతివాది

RESPONDENT

చింతకాయల నారాయణస్వామి, తండ్రి సి.వేమనారాయణ, వయస్సు 45 సంవత్సరములు, నివాస చిరునామ ఇంటి నెం.1/1125-33-1, APRSTC డిపో దగ్గర, ఆడపాల వీధి, కదిరి పట్టణము, శ్రీ సత్యసాయి జిల్లా. సెల్ నెం: 833203033

ప్రతివాదికి కోర్టు నోటీసులు

పై తెలిపిన వాది మీ పై ప్రామిసరీ నోటు ఋణ వసూలు కోసం దావా వేసియున్నారు. ఈ దావాలో నిన్ను ప్రతివాదిగా చేర్చడమైనది. మీ హాజరు నిమిత్తమై పై కోర్టులో తేది: 25-09-2025న వాయిదా వేసియున్నారు. కావున పై తేదీన మీరు స్వయముగా గాని లేదా వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల కోర్టు వారికి తెలుపుకోవలసినదిగా ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది : 25-09-2025
స్థలం: కదిరి

కె.నాగేంద్ర రెడ్డి,బి.ఎ., బి.యల్,
పిటీషనర్‌తరపు న్యాయవాది, కదిరి